W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

17-3-2026

వరంగల్



## నిరుద్యోగ సమస్యలపై గళం విప్పిన వరంగల్ ఎంపీ

వరంగల్ జిల్లాలో యువతలో పెరుగుతున్న నిరుద్యోగం, ఉపాధి కోసం హైదరాబాద్ సహా ఇతర మహా నగరాలకు వలసలు పెరుగుతున్న అంశాన్ని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పార్లమెంట్‌లో ప్రస్తావించారు.

02





02

## సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

సమాజంలో జరుగుతున్న సైబర్ మోసాలు, రోడ్డు భద్రతలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని తొర్రూరు సిఐ గణేష్ అన్నారు. మండలంలోని నాంచారి మడూరు గ్రామంలో ఎంజెపి బీసీ బాలుర గురుకుల డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) క్యాంపులో భాగంగా 5వ రోజు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత అలాగే ప్రమాదాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.



06

## అమెరికాలో వరంగల్ యువ ఇంజినీర్ మృతి

అమెరికాలో వరంగల్ రామనాథపురికి చెందిన జితేందర్ రావు కుమారుడు రాకేష్ (40) సాఫ్ట్వేర్ ఇంజినీర్ గుండెపోటుతో మృతిచెందారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్లిన రాకేశ్ కుటుంబంతో కలిసి విరిగినియాలో సాఫ్ట్వేర్ ఇంజినీర్ గా పనిచేస్తూ స్థిరపడ్డారు.

# ధనాధన్.. పరిష్కారం

- ఆలస్యం చేయకండి.. త్వరగా పరిష్కరించండి
- పెండింగ్ లో ఉన్న ఫైళ్లను క్లియర్ చేయాలి
- అధికారులకు కలెక్టర్ సత్యశారద ఆదేశాలు
- ప్రజావాణిపై స్పెషల్ ఫోకస్



వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన వినతి పత్రాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో దరఖాస్తుదారుల సమక్షంలోనే చర్చించి సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజావాణిలో అందిన వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

03

మహా, వరంగల్ బ్యూరో



మహా పత్రిక
ANN తెలుగు

# నిరుద్యోగ సమస్యలపై గళం విప్పిన వరంగల్ ఎంపీ

## పరిశ్రమలు లేక యువత వలసలు... వరంగల్ యువతకు ఉపాధి కల్పించాలి

**హన్మకొండ మహా:** వరంగల్ జిల్లాలో యువత లో పెరుగుతున్న నిరుద్యోగం, ఉపాధి కోసం హైదరాబాద్ సహా ఇతర మహా నగరాలకు వలసలు పెరుగుతున్న అంశాన్ని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పార్లమెంట్‌లో ప్రస్తావించారు. పరిశ్రమల అభివృద్ధి లోపం, స్థానికంగా తగిన ఉద్యోగ అవకాశాలు లేకపోవడం వల్ల యువత, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా 15--29 ఏళ్ల మధ్య యువతలో నిరుద్యోగం ఎంత మేర ఉందో, ఈ వలసలను తగ్గించేందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటోందో వివరాలు ఇవ్వాలని ఎంపీ కేంద్రాన్ని కోరారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే సమాధానం ఇస్తూ, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే తాజా గణాంకాల ప్రకారం తెలంగాణలో యువత నిరుద్యోగం 2017--18 లో 23.3 శాతం ఉండగా 2023--24 నాటికి 16.6 శాతానికి తగ్గిందని తెలిపారు. ఇదే సమయంలో వర్కర్ పాప్యులేషన్ రేషియో 32 శాతం నుంచి 40.7 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కూడా నిరుద్యోగం 17.8 శాతం నుంచి 10.2 శాతానికి తగ్గిందని, ఉపాధి లో ఉన్న వారి శాతం 31.4 నుంచి 41.7కు పెరిగిందని మంత్రి వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ ఇండియా మిషన్, ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్, ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సాధారణ పథకాలతో మాత్రమే వరంగల్ ప్రాంతంలోని ప్రత్యేక సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎంపీ డా. కడియం కావ్య అభిప్రాయపడ్డారు. పరిశ్రమల కొరత, వ్యవసాయ ఆధారిత ఉపాధి సీజనల్ గా ఉండటం వల్ల యువత వలసలు ఆగడం లేదని పేర్కొన్నారు. వరంగల్ ప్రాంతానికి ప్రత్యేక పరిశ్రమలు, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచే విధంగా కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



# సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

**తొర్రూరు, మహా:** సమాజంలో జరుగుతున్న సైబర్ మోసాలు, రోడ్డు భద్రతలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని తొర్రూరు సిఐ గణేష్ అన్నారు. మండలంలోని నాంచారి మడూరు గ్రామంలో ఎంజెపి బీసీ బాలుర గురుకుల డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) క్యాంపులో భాగంగా 5వ రోజు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత అలాగే ప్రమాదాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారాలు ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావదన్నారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ నందన దేవి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు ఎస్సై ఉపేందర్, నాంచారి మడూరు సర్పంచ్ బంగారు రమేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ హరి ప్రసాద్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గిరి ప్రసాద్,వైస్ ప్రిన్సిపాల్ రేవ్యా నాయక్, అధ్యాపకులు,వలంటీర్లు పాల్గొన్నారు.




# అవార్డు అందుకున్న రాయి పెల్లి యాకయ్య

**తొర్రూరు,మహా:** తొర్రూరు మండలం హరిపీరాల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రాయిపెల్లి యాకయ్య భారత్ విద్యా రత్న ఉగాది జీవిత సాఫల్య పురస్కారం తో పాటు గురు బ్రహ్మ అవార్డును అందుకున్నారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యాకయ్య పాఠశాల అభివృద్ధి, పిల్లల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్న సేవలను గుర్తించి సోమవారం మదర్ థెరిసా వాలంటరీ ఆర్గనైజేషన్ విశాఖపట్నం ఆంధ్ర ప్రదేశ్ మరియు గ్లోబల్ ఫౌండేషన్, గురు బ్రహ్మ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యున్నత పురస్కారమైన భారత విద్యారత్న అవార్డును విజయవాడలో అలంకార్ ఫంక్షన్ హాల్ జరిగిన ప్రత్యేక అవార్డు ప్రధాన ఉత్సవంలో అవార్డు గ్రహీత మురళీకృష్ణ,గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత డాక్టర్ నాగ స్వామి నాయక్, భూపతి మరియు మదర్ తెరిసా వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి ల చేతుల మీదుగా మెమొంటో, ప్రశంసా పత్రం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాయిపెల్లి యాకయ్య గత 25 సంవత్సరాలుగా ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల విద్యార్థుల అభ్యున్నతి, పాఠశాల అభివృద్ధికి చేస్తున్న విశిష్టమైన సేవలను గుర్తించి భారత విద్యారత్న



పురస్కారం తో పాటు గురు బ్రహ్మ అవార్డుతో సత్కరించినట్లు తెలిపారు. యాకయ్య మాట్లాడుతూ ఈ అవార్డు తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందని, దీంతో తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.భవిష్యత్తులో పేద పిల్లల విద్యా అభ్యున్నతికి పాఠశాల పురోగతికి పాటుపడతానని, అవార్డుతో సత్కరించిన ప్రముఖులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యాకయ్యను మిత్రులు గుర్రం వెంకన్న, కొయ్యడ కుమారస్వామి, శ్రీధర్ రెడ్డి,చంద్రశేఖర్, ముత్తి లింగం, పూర్ణచందర్, మధుకర్ రెడ్డి, రఘు, శ్రీనివాస్ ,యాక మల్లయ్య, కుమార్, రమేష్, రవి,రాజు , రవీంద్ర కుమార్, వెంకన్న, లింగరాజు, సామ్సన్ సుధాకర్ ,శ్రీకాంత్ ,భాస్కర్, శ్రీనివాస్, విద్యార్థులు అభినందించారు.

# ధనాధన్.. పరిష్కారం

## ఆలస్యం చేయకండి.. త్వరగా పరిష్కరించండి

## పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్లియర్ చేయాలి




**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన వినతి పత్రాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో దరఖాస్తుదారుల సమక్షంలోనే చర్చించి సమస్యల పై వివరాలు తెలుసుకున్నారు. ప్రజావాణిలో అందిన వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 136 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 60, జీడబ్ల్యూఎంసీ కి సంబంధించినవి 15, ఇతర శాఖలకు సంబంధించినవి 61 దరఖాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చిన నేపథ్యంలో వాటిని సంబంధిత తహసీల్దార్ల కు ఎండార్స్ చేసి త్వరితగతిన పరిష్కారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ శాఖలో పెండింగ్ దరఖాస్తులు అధికంగా ఉన్న నేపథ్యంలో సంబంధిత మండలాల తహసీల్దార్లు కార్యక్రమానికి హాజరు కావడంతో కొంత మేరకు సమస్యల పరిష్కారానికి అవకాశం కలిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా వృద్ధుల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను శిశు సంక్షేమ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సఖి సెంటర్ కోఆర్డినేటర్ శ్రీలత కు పంపించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, శాఖల్లో పెండింగ్ లో ఉన్న ఫైళ్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, డిఆర్ ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు సుమ, ఉమారాణి, హౌసింగ్ పీడీ శ్రీవాణి, డీడబ్ల్యూవో రాజమణి, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.







# క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు

## జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా. హిమబిందు

**హన్మకొండ మహా:** క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అప్పుడే క్షయ వ్యాధిని అంత మొందించడం సాధ్యమని క్షయ వ్యాధి లేని సమాజాన్ని నిర్మించడమే మన లక్ష్యమని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు అన్నారు. మార్చి 24 ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య సూచనలతో శుక్రవారం కాకతీయ డిగ్రీ కళాశాల హనుమకొండ లో క్షయ వ్యాధి అవగాహన సదస్సు క్షయ నియంత్రణ అధికారిని డాక్టర్ హిమబిందు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ , క్షయ వ్యాధి వచ్చినపుడు రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం తేమడ లో రక్తం పడడం లాంటి లక్షణాలను బట్టి క్షయ వ్యాధిగా గుర్తించి మీ దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రాలలో తేమడ పరీక్ష ద్వారా క్షయ వ్యాధిని నిర్ధారించుకోవచ్చు డాక్టర్ సూచించిన మందులను క్రమం తప్పకుండా కాల పరిమితి కోర్సు వాడాలని మధ్యలో ఆపినట్లైతే వ్యాధి ముదిరి ప్రాణాంతక టీబి గా మారి ప్రాణం కూడా కోల్పోవచ్చని ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ దగ్గు వచ్చినపుడు చేతి రుమాలు వాడడం మాస్క్ ధరించడం వల్ల ఒకరి నుండి మరొకరికి రాకుండా జాగ్రత్త పడవచ్చని టీబీ పేషెంట్ కి మందులు ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందని, పేషెంట్ కు నెలకు 1000 రూపాయలు ఆరు నెలల పాటు వారి పోషకాహారం కోసం నేరుగా వారి ఖాతా లో జమ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ డిగ్రీ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్, టీచింగ్ స్టాఫ్ డా.రోహిణి పద్మ, జిల్లా క్షయ వ్యాధి టీబి ప్రోగ్రామ్ కో.. ఆర్డినేటర్లు వి. సుష్మా, పి కిరణ్ కుమార్, డి నగేష్ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ టీ. విజయ్ , సతీష్, హెల్త్ విజిటర్స్ సునీత పాల్గొన్నారు.





# రక్తదానం చేసి ప్రాణ దాతలు కండి

## హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్.. జిల్లా అడ్మినిస్ట్రేషన్ ట్రెజరరీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**హన్మకొండ మహా:** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా ఖజానా శాఖ కార్యాల ప్రాంగణంలో తలసేమియా బాధితులను కాపాడేందుకు రక్తదాన శిభిరం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు చాహత్ బాజ్ పాయ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రక్త దాతలకు సర్టిఫికెట్లు అందించి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ గొప్ప సేవా కార్యక్రమమైన రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన జిల్లా పరిపాలనకు అభినందనలు తెలిపారు. రక్తదానం అనేది మనం మానవత్వానికి అందించగల అత్యున్నత సేవలలో ఒకటి. ఒక యూనిట్ రక్తం అనేక అమూల్యమైన ప్రాణాలను కాపాడగలదు. ప్రత్యేకంగా వేసవి కాలంలో రక్త బ్యాంకుల్లో రక్తం కొరత ఎక్కువగా ఉంటుంది. అదే సమయంలో అనేక మంది రోగులు నిరంతరం రక్తంపై ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా థలసీమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఆరోగ్యంగా జీవించడానికి తరచూ రక్త మార్పిడి అవసరం అవుతుంది. వారికి రక్తం అనేది కేవలం అవసరం మాత్రమే కాదు, అది నిజంగా వారి ప్రాణాధారం. ఈ సందర్భంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం అవసరమైన వారికి సమయానికి రక్తం అందేలా చూడడంలో ఎంతో ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తోంది. రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవ నిజంగా మానవతా సేవగా నిలుస్తోంది. అందువల్ల యువత, సేవా సంస్థలు, ఎన్‌జీవోలు ముఖ్యంగా వేసవి కాలంలో నియమితంగా రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు ముందుకు అన్నారు. సమాజంలో మార్పు తీసుకురాగల శక్తి, ఉత్సాహం, దయ యువతలో ఉన్నాయి. రక్తదానం పూర్తిగా సురక్షిత మైనది, సులభమైనది. మనం ఎవరో ఒకరి ప్రాణాన్ని కాపాడుతున్నామనే ఆనందం అపారమైన తృప్తిని ఇస్తుంది. కాబట్టి మనమంతా కలిసి రక్తదానం పై అవగాహన పెంచుతూ, ఎక్కువ మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసేలా ప్రోత్సహిద్దాం. ఈ రక్తదాన శిబిరం లో హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, బిళ్ళ రమణారెడ్డి, జిల్లా ఖజానా శాఖ అధికారి అకవారం శ్రీనివాస్ కుమార్, టి. ఎన్. జి. ఓ. ప్రెసిడెంట్ ఆకుల రాజేందర్, టి. జి. ఓ. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ రావు, ఉద్యోగ సంఘు నేతలు బైరి సోమయ్య, డా. ప్రవీణ్, రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, కోలా రాజేష్ కుమార్, మాధవ రెడ్డి, లక్ష్మి ప్రసాద్, విజయలక్ష్మి, కిరణ్, శ్యామ్ సుందర్, ఫణికల రాజేష్, యం. ఆర్. ఓ లు బావు సింగ్, జగన్ మోహన్ రెడ్డి, ఖజానా శాఖ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, అన్వర్, చంద్ర శేఖర్, దయాకర్, ప్రసాద్, ఉదయ్ భాస్కర్, ఉద్యోగ సంఘాలు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం శిబిరాన్ని విజయవంతం చేశారు.



## ఘనంగా గణపతి పూజా మహోత్సవం

**తొర్రూరు మహా:** మువ్వా డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అకాడమీలో గణపతి పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ శాస్త్రీయ నృత్యాలు పేరిణి, కూచిపూడి నేర్చుకున్న చిన్నారి అకాడమీ నాట్యాచార్యుడు పేరిణి రాజేందర్ శిష్య బృందంతో గణనాధుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన వేద పండితులు శ్రీనివాస శర్మ పూజ నిర్వహించి, ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా డాన్స్ మాస్టర్ రాజేందర్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన చిన్నారులు 8 నెలల పాటు నృత్యం నేర్చుకున్నారని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్సకు వచ్చిన యువతిపై డాక్టర్ అనుచిత ప్రవర్తన

### డాక్టర్‌కు దేహశుద్ధి చేసిన మహిళలు

**మహా వరంగల్ బ్యూరో:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణం లోని విజయలక్ష్మి ఆసుపత్రికి జ్వరం కోసం వచ్చిన 21 ఏళ్ల యువతితో డాక్టర్ కిరణ్ కుమార్ అనుచితంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో యువతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. డాక్టర్ కు బాధితురాలి కుటుంబ సభ్యులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకోగా బాధితురాలి తో కలిసి మహిళలు డాక్టర్ ను చితక బాదారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు రంగంలోకి దిగిన డాక్టర్ ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.



## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై సమీక్ష

### హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హనుమకొండ మహా:** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమాల పురోగతిపై హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సోమవారం సమీక్ష నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, డిప్యూటీ డివిజనల్ పంచాయతీ అధికారులు (డీఎల్‌పీఓలు) రవిబాబు, గంగభవాని తో గ్రామపంచాయతీ లకు సంబంధించిన వివిధ అంశాల పై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ లలో పన్నుల వసూలు, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల అమలు తీరు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యాలయాలకు పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ ఉదయం 9 30 గంటల లోపు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అపరిశుభ్రత లేకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో గ్రామపంచాయతీలలో పన్నుల వసూళ్లను వేగవంతం చేసి వంద శాతం పన్నులు సేకరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు .గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు.


## కలెక్టర్‌ను కలిసిన కార్పొరేటర్

**మహా వరంగల్ బ్యూరో:** బల్దియా కమిషనర్ గా పనిచేస్తున్న చాహత్ బాజ్ పాయ్ ను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా హనుమ కొం డ కలెక్టర్ కార్యాలయంలో 22 వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి ఆమె ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డివిజన్ సమస్యలపై కలెక్టర్ తో చర్చించారు.



# కలెక్టరేట్ భవనం ఎక్కి యువకుడి హల్చల్

**హన్మకొండ మహా:** తన భూమిని అక్రమంగా ఇతరులకు పట్టా చేశారని ఆరోపిస్తూ పురుగుల మందు డబ్బాతో హల్చల్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం పైకి ఎక్కి యువకుడు ఆత్మహత్య యత్నం చేసిన సంఘటన సోమవారం హనుమకొండ కలెక్టరేట్లో చోటుచేసుకుంది. ధర్మసాగర్ మండలం మండల కేంద్రానికి చెందిన బాధితుడు పయ్యావుల సాంబరాజు తెలిపిన వివరాల ప్రకారం ధర్మసాగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1146/ఏ లో 4.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇదే సర్వే నంబర్ లో ధర్మసాగర్ కు చెందిన అప్పాల సాయిలు, గట్టయ్య, మహేందర్, రవి, రాములు లకు సుమారు 3.01 ఎకరాల భూమి ఉంది. కాగా ధర్మసాగర్ రిజర్వాయర్ ముంపు కింద భాగం అప్పాల వారి కుటుంబ సభ్యులకు చెందిన 2.38 ఎకరాల భూమి ముంపు కింద పోయి ప్రభుత్వంతో నష్టపరిహారం తీసుకున్నారు. కాగా పయ్యావుల మల్లయ్యకు 4.10 ఎకరాల భూమి ఉండగా 4 ఎకరాలు మాత్రమే పట్టా అయ్యింది. మిగతా 10 గుంటల భూమి పట్టా కావాలని తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో అప్పాల మహేందర్ అతని కుటుంబ సభ్యులు తహసీల్దార్ తో చేతులు కలిపి గ్రామ పెద్దమనుషులు, మాజీ సర్పంచ్ తో కలిసి ముంపు కింద పోయిన భూమిని తిరిగి పట్టా చేసుకున్నారు. పట్టా చేసుకుని పయ్యావుల మల్లయ్య ఖాస్తులో ఉన్నా భూమిలోకి వచ్చి ఈ భూమి తనదేనని గొడవకు దిగుతున్నారు. ఈ క్రమంలో పయ్యావుల మల్లయ్య కుమారుడు పయ్యావుల సాంబరాజు ధర్మసాగర్ తహశీల్దార్ కార్యాలయంలో తమ భూమిని వేరే వారికి పట్టా చేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ధర్మసాగర్ తహశీల్దార్ ఫీల్డ్ సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని హామీ ఇచ్చారు. తదనంతరం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన సర్వే రిపోర్ట్ ఇవ్వకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ సమస్య పై భాదితులు పలు సార్లు కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదు. దీనితో విసుగు చెందన భాదితులు పయ్యావుల మల్లయ్య కుమారుడు సాంబరాజు సోమవారం పురుగుల మందు డబ్బా తో జిల్లా కలెక్టర్ కార్యాలయం పైకి ఎక్కి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



# అమెరికాలో వరంగల్ యువ ఇంజినీర్ మృతి

**మహా వరంగల్ బ్యూరో:** అమెరికాలో వరంగల్ 22 వ డివిజన్ రామనాథపురికి చెందిన జితేందర్ రావు కుమారుడు రాకేష్ (40) సాఫ్ట్వేర్ ఇంజినీర్ గుండెపోటుతో మృతిచెందారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్లిన రాకేశ్ కుటుంబంతో కలిసి విరిగినియాలో సాఫ్ట్వేర్ ఇంజినీర్ గా పనిచేస్తూ స్థిరపడ్డారు. 2014లో కరీంనగర్ కు చెందిన తేజస్వినితో వివాహం కాగా ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. చిన్న వయసులోనే ఆయన మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. విషయం తెలుసుకుని సోమవారం వారి కుటుంబ సభ్యులను 22 వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి పరామర్శించి ఓదార్చారు.



# వేగంగా మట్టెవాడ ఈద్గా పునర్నిర్మాణ పనులు

**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 11 డివిజన్ లోని మట్టెవాడ ఈద్గా పునర్నిర్మాణం కోసం బల్దియా సాధారణ నిధుల కింద కోటి రూపాయల వ్యయంతో ఇటీవల స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. గత కొన్ని రోజులుగా పునర్నిర్మాణంలో భాగంగా సి సి ఫ్లోరింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. కొండా దంపతుల ఆదేశాల మేరకు వరంగల్ తూర్పు మైనార్టీ నాయకులు సయ్యద్ వసీం ప్రతిరోజు ఈ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



07
FOLLOW: @ANNTELUGU
17-3-2026
WWW. EPAPER.MAHAADAILY.COM
వరంగల్
మహా పత్రిక
ANN తెలుగు

# అంకితభావంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలి

## బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**మహా వరంగల్ బ్యూరో:** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా దేశాయిపేట మండలం నిర్వహిస్తున్న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ -- 2026 కార్యక్రమం లో భాగంగా సోమవారం దేశాయిపేట మండల కార్యశాల నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు సేవా భావంతో పనిచేసే కార్యకర్తలే పార్టీకి బలమని అన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలను దేశ ప్రయోజనాల కోసం పార్టీ చేస్తున్న కృషిని ప్రజలకు చేరవేయాలని సూచించారు. ముఖ్యంగా బూత్ స్థాయిలో ఉన్న కార్యకర్తలే పార్టీ విజయానికి పునాది అని పేర్కొంటూ, ప్రతి బూత్‌లో బలమైన సంస్థాగత నిర్మాణం ఉండేలా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ ప్రజల సమస్యలను





తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. రానున్న ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో, క్రమశిక్షణతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం జిల్లా కన్వీనర్ కందిమల్ల మహేష్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాబేటి వెంకట్ గౌడ్, మండల అధ్యక్షులు విప్ప సుధాకర్,మరియు పార్టీ జిల్లా, మండల నాయకులు, పదాధికారులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి.. ప్రజావాణి కార్యక్రమానికి 170 అర్జీలు

**హన్మకొండ మహా:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన వినతులను వేగవంతంగా పరిష్కార చర్యలను చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు ప్రజలు వినతి పత్రాలను అందించి తమ సమస్యలను వివరించారు. ప్రజలు వినతి పత్రాలను అందజేస్తూ సమస్యలను చెప్పగా కలెక్టర్ ఓపికగా విని వాటి పరిష్కారానికి చర్యలు సంబంధిత అధికారులను అప్పటికప్పుడే ఆదేశించారు. 170 వినతులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో తప్పనిసరిగా సంబంధిత జిల్లా అధికారులు విధిగా పాల్గొనాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి తదుపరి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా



రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, డిఆర్డివో మేన శ్రీను, జడ్పీ సీఈవో శేషాద్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.